## కథ

# పెద్దమనసు

**చెన్ను సుశీలారామం**

**అరుంధతి అరగంట నుండీ అరుగుమీద నిలబడుంది. ఆమె ధ్యాసంతా వీధి చివర్నుంది. సరిగ్గా గడియారం పన్నెండు గంటలు కొట్టే ప్పటికల్లా పోస్ట్‌మేన్ పోతురాజు ఆ వీధిలోకొచ్చి తీరతాడు. ఆరోజు మాత్రం పన్నెండు దాటి అరగంటైనా అతని జాడ లేదు. అరుంధతి కాళ్లు పీక్కుపోతున్నాయి.**

''అరుంధతీ.. అమ్మాయ్ అరుంధతీ..'' వంటగదిలోంచి తల్లి పిలుపు వినిపించినా ఆ పిల్ల అక్కడ్నుండి కదల్లేదు.

''ఒరే అరుణ్''

''ఎందుకమ్మా?'' టీవీ చూస్తూన్న వాడల్లా వాల్యూం తగ్గిస్తూ అడిగాడు అరుణ్.

''అక్కేదిరా? గదిలో మంచానికడ్డంబడి ఏ పుస్తకమో చదువుతూంటూంది. దానికా పుస్తకాలుంటే, ఈ ప్రపంచం తలకిందులైనా పట్టదు. ఒరే బాబూ ఒక్కసారి లేచెళ్లి దాన్ని పిల్చుకు రారా''

''అబ్బా ఏంటమ్మా నువ్వు? హాలీడేగా. చక్కగా క్రికెట్ మేచ్ చూస్తుంటే నాకే అన్ని పన్లూ చెప్తావు. ఇప్పుడిప్పుడే మేచ్ మంచి ఇంట్రెస్టింగ్‌గా ఉంది''

అయిష్టంగానే టీవీ ముందు నుండి కదిలాడు అరుణ్. గదిలో చూస్తే అక్క కనిపించలేదు.. స్టోర్ రూంలో, పెరట్లో చూశాడు. ఆఖరిగా వీధి అరుగుమీద నిలబడుండడం చూశాడు.

''మహాతల్లీ నువ్విక్కడున్నావా? అవతల అమ్మ అరుస్తూంటే నీకు వినిపించడం లేదా? కొంపదీసి చెవుడుగానీ పట్టుకుందేంటే నీకు?''

''అమ్మ పిలవడం నాకు వినిపించింది లేరా''

''అలాగా. మరి లోపలికి రాలేదేం? నువ్వు నిల్చున్న చోటే నీ కాళ్లుగానీ అతుక్కుపోయాయేంటే ఖర్మ''

తమ్ముడ్ని ఏం కోప్పడేదో గాని.. వీధి మొదట్లో పోస్ట్‌మేన్ పోతురాజు రావడం చూసిన అరుంధతి మొహంలోకి వెలుగొచ్చింది. ''అడుగో పోతురాజొస్తున్నాడు''

''అవును పోతురాజే.. ఈ మాత్రానికి ఇంత గట్టిగా అరవాలన్నా? ఇంతకీ ఇంత టెన్షన్‌గా పోస్ట్‌మేన్ గురించి ఎదురుచూస్తున్నావంటే, ఏదో విశేషమే ఉండాలే. ఏంటబ్బా అదీ.. ఆ, ఇప్పుడు గుర్తుకొచ్చింది. మొన్న నిన్ను చూసుకెళ్లిన పెళ్లివాళ్లు ఏ విషయం ఉత్తరం రాస్తానన్నారు గదూ? దానికన్నమాట నీ ఆదుర్దా అంతా..సరే..నువ్వాపనేదో చూసుకునే లోపలికిరా. నే వెళ్లి ఏ విషయం చెప్పకపోతే చేతిలో ఉన్న ఏ అట్లకాడతోనో గరిటతోనో వచ్చి నా వీపున వాతపెట్టెయ్యగలదు అమ్మ'' భయం నటిస్తూ లోపలికెళ్లిపోయాడు అరుణ్.

పోస్ట్‌మేనిచ్చిన కవరందుకుంది అరుంధతి. ''ఏంటి పోతురాజు ఇవాళ నీ టైం మారిందేంటీ? అరగంట నుండీ నీ కోసం ఎదురుచూస్తున్నాను''

''నా సైకిలు టైరు పంచరైందమ్మా. దీన్ని రిపేరు చేయించుకొచ్చేసరికి ఈ టైమైంది'' చెప్పేసి వెళ్లిపోయాడతను.

తన గదిలోకెళ్లి లెటర్ విప్పి చదువుకున్న అరుంధతి మనసు పురివిప్పిన నెమలి లాగా నాట్యం చెయ్యసాగింది. ''అమ్మా.. అమ్మా..'' అరుస్తూ తల్లి దగ్గరకు పరుగెత్తింది.

''అమ్మా.. ఇదిగో ఉత్తరం''

''ఎక్కడ నుంచే ఉత్తరం?''

''నే చెప్పను. నువ్వే చదువుకో''

''సరే ఆ పక్కన పెట్టు తర్వాత చూస్తాలే''

''అలా వీల్లేదు. ఇప్పుడే చదువు. ఆ అప్పడాలు నేను వేయిస్తాలే. ముందక్కడ్నుండి లేమ్మా'' కూతురు బలవంతం పెట్టడంతో చేతులు నేప్‌కిన్‌కి తుడుచుకుని, ఉత్తరం అందుకుని చదవసాగింది అన్నపూర్ణ.

''చిరంజీవి యగు చెల్లమ్మ అన్నపూర్ణకు.

ఆనందరావు దీవించి వ్రాయునది. ఇక్కడ మేము క్షేమం. మీరు క్షేమమని తలుస్తాము. ముఖ్యంగా మీకు రాసేదేమనగా.. మీ అమ్మాయి చిరంజీవి సౌభాగ్యవతి అరుంధతి మాకు బాగా నచ్చింది. మీ కుటుంబం పడికట్టు.. ఆచారవ్యవహారాలు.. మీ అతిథి సత్కారాలు.. మమ్మల్నెంతో ముగ్ధుల్ని చేశాయి. మీకు మగ దిక్కులేకపోయినా అన్నీ ఎంతో పద్ధతిగా, చక్కగా నిర్వహించారు. మాకు కట్నకానుకల్తో పన్లేదు. మీ అమ్మాయి మా ఇంటి కోడలైతే, అదే మాకు లక్షలు, కోట్లు అనుకుంటున్నాము. ఈ నెల ముప్పై రాత్రి ఏడు గంటలకు మంచి ముహూర్తం ఉంది. మా అబ్బాయి అరవింద్, మీ అమ్మాయి అరుంధతి వివాహానికి ఆ శుభముహూర్తాన్ని ఖాయపరిచాం. ఈ శుభవార్త నేనే వచ్చి మీకు చెబుదామనుకున్నాను. కానీ నాకు బాగా జ్వరంగా ఉండి ఎక్కడికీ కదల్లేని పరిస్థితిలో మీకీ ఉత్తరం రాయాల్సొచ్చింది. అరవింద్‌ని పంపుదామంటే వాడు ఆఫీసు పని మీద కేంప్ వెళ్లాడు. నాకు జ్వరం తగ్గాక వచ్చి మిమ్మల్ని కలుస్తాను. మీరు పెళ్లి పనులు ప్రారంభించుకోండి. మా కోడలు చిరంజీవి సౌభాగ్యవతి అరుంధతికి చిరంజీవి అరుణ్‌బాబుకు మా ఆశీస్సులు

-ఇట్లు.. ఆనందరావు''

చదువుకున్న అన్నపూర్ణ ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోసాగింది. ఆమెకంతా ఏదో కలలాగా మరో లోకంలో ఉన్నట్టుగాను అనిపించసాగింది. కూతురి దగ్గరకెళ్లి ముద్దులాడింది. ఆమె కళ్లల్లో ఆనందభాష్పాలు తళతళ మెరవసాగాయి.

''నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా. పైసా కట్నం కోరని సంస్కారవంతులు దొరకడం మన పూర్వజన్మ సుకృతమే. బాబూ అరుణ్ అక్క పెళ్లి ఈ నెల ముప్పైనరా. అయ్యయ్యో.. నాకాళ్లూ చేతులాడ్డంలేదు. నేను వెంటనే వెళ్లి ఈ శుభవార్త పక్కింటి పిన్నిగారికి చెప్పాలి'' హడావుడిగా వెళ్లింది.

''హాయ్ సిస్టర్.. నువ్వు వెరీ లక్కీ ఫెలోవే. పెళ్లిచూపులప్పుడే అనుకున్నాను హిందీ సినిమాల్లో హీరోలా ఉన్నాడు ఇతడు నాకు బావైతే ఎంత బావుంటుందో అని. అంతా నేను కోరుకున్నట్టే జరిగింది. మా అక్కయ్య పెళ్లికూతురాయెనే, బావయ్య పెళ్లికొడుకాయెనే'' ఇల్లంతా, గెంతులేస్తూ పాడసాగాడు అరుణ్. అరుంధతి సిగ్గులమొగ్గే అయ్యింది.

''పిన్నిగారూ.. పిన్నిగారూ..''

''ఎవరూ? అన్నపూర్ణమ్మ..రా.. ఏంటి విశేషం? చాలా సంతోషంగా కనిపిస్తున్నావు?''

''అవునండీ పిన్నిగారు సంతోషమే. నా జీవితంలో ఇంతటి ఆనందాన్ని ఎప్పుడూ అనుభవించి ఎరగనంటే నమ్మండి. మన అరుంధతిని చూసుకెళ్లిన పెళ్లివారి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. అరుంధతి వాళ్లకు బాగా నచ్చిందట. పైసా కట్నం అక్క-

ల్లేదట. ఈ నెల ముప్పైనే ముహూర్తమట. ఏంటో పిన్నిగారూ.. నాకు కాళ్లూ చేతులాడ్డం లేదు''

''చాలా సంతోషంగా ఉందమ్మా అన్నపూర్ణా. నీది మంచి మనసు. అందుకే అంతా నీకు మంచే జరుగుతుంది. అమ్మాయ్ అన్నపూర్ణా నువ్వు దేనికీ గాభరా పడకు. అన్నిటికీ మేం ఉన్నాం. ముహూర్తానికి ఇంక పదిరోజులే టైముంది. అన్ని పన్లూ చకచకా జరిగిపోవాలి. పెళ్లి జరిపించే హాలు బుక్ చేయాలి. వంటవాళ్లను మాట్లాడాలి. బాజా భజంత్రీలను కుదర్చాలి. శుభలేఖలు అచ్చేయించాలి. పెళ్లి బట్టలు.. సూత్రం.. బటువ మట్టెలు కొనాలి''

''పిన్నిగారూ అంతా మీదే భారం. మీరు బాబాయ్‌గారు సాయంరానిదే నా వల్ల ఏ పనీ గాదు''

''నీకెందుకు నువ్వలా కూచునుండు. అన్ని పన్లూ మేం చూసుకుంటాం. నలుగురు పిల్లల పెళ్లిళ్లు చేసిన అనుభవం ఉంది మాకు. అన్నపూర్ణా వియ్యాలవారు కట్నం వద్దంటున్నారు గనక, పెళ్లి కాస్త ఘనంగా జరిపిస్తే వాళ్లూ ముచ్చట పడతారు. ఏవంటావ్?''

''నిజమే పిన్నిగారూ. కట్నకానుకలేమడుగుతారోనని గుండెలరచేత్తో పట్టుకున్నానింతవరకూ. నాకా అంత స్థోమతు లేదు. ఆ భగవంతుని దయ వల్ల అంతా మనకు అనుకూలంగానే జరుగుతూంది. నాకున్నది ఒక్కగానొక్క ఆడపిల్ల. నా ఇంట జరిగే తొలి శుభకార్యం ఇది. ఆయనే గనక ఉంటే ఎంత పొంగిపోయేవారో'' భర్తను తల్చుకుని బాధపడింది అన్నపూర్ణ.

ఆమె వీపు తట్టి ఓదార్చింది పిన్నిగారు. ''ఊరుకోమ్మా. అంతా విధి రాత. ఎవరు మాత్రం ఏం చెయ్యగలం? కానీ అన్నపూర్ణా నీ కూతురి విషయంలో మాత్రం ఆ విధాత నీకెంతో ఉపకారమే చేశాడు. పిల్ల ఎంత రంభలాగున్నా ఎంత చదూకున్నా నెలొచ్చేసరికి వేలకు వేలు సంపాయిస్తున్నా కట్న రూపేణా కాసులక్కడ పెడితేగానీ కన్నెపిల్ల మెళ్లో మూడుముళ్లు వేయడం లేదు ముదనష్టం మగపిల్లలు. వాడు మొలతాడు కట్టిన మగాడైతే చాలు కట్న కానుకలు దండుకోడానికి రెడీ అయిపోతున్నారు. అలాంటిది మన అరుంధతి ఎంత అదృష్టవంతురాలు గాకపోతే కట్నం అడగని వాళ్లు దొరుకుతారు. అమ్మాయ్ అన్నపూర్ణా నీ కష్టాలు గట్టెక్కినట్టే. నీ కూతురి బాధ్యత తీరిపోతే ఇంక మగ పిల్లాడంటావా వాడ్ని మెల్లగా చదివించుకుని వృద్ధిలోకి తీసుకొచ్చి వాడికో దారి చూపిస్తే వాడి పంచన నీ జీవితం సాఫీగా గడిచిపోతూంది. మీ బాబాయ్ గారు ఊర్నించి రేపొస్తారు. ఆయన రాంగానే మనం దరం కూచుని ఏది ఎలా చేస్తే బావుంటుందో అన్ని విషయాలూ మాట్లాడుకుందాం. ఈలోపుగా నువ్వు మీ చుట్టాలు, బంధువులు పేర్లు లిస్టు



తయారుచేసి ఉంచు. నాలుగు రోజుల్లో శుభలేఖలు అచ్చెయించేస్తే అందరికీ పోస్టులో పడేయ్యొచ్చు''

''అలాగే పిన్నిగారూ. మీరున్నారు గనక నాకు కొండంత అండగా, ధైర్యంగా ఉంది. వస్తానండీ. మళ్లీ సాయంత్రం వచ్చి కలుస్తాను మిమ్మల్ని''

★ ★ ★

పెళ్లి నాలుగు రోజుల్లోకొచ్చేసింది. ఇల్లంతా పెళ్లి కళతో, కళకళ్లాడిపోతూంది. ఆ రోజు సాయంత్రం ఆనందరావు వచ్చాడు. వియ్యంకుడ్ని సాదరంగా ఆహ్వానించి సకల మర్యాదలు చేసింది అన్నపూర్ణ.

''అమ్మా అన్నపూర్ణా నీతో కాస్త మాట్లాడాలి. అలా గదిలోకెళ్దామా?'' అతన్ని విడిగా గదిలోకి తీసుకెళ్లింది అన్నపూర్ణ. ఆమె మనసులో ఎక్కడో అనుమానపు ముల్లు కలుక్కుమంది.

ఆనందరావు కుర్చీలో కూచున్నాడు. ''మరేం కాదమ్మా నాకు ఒక్కగానొక్క కొడుకు. వాడికి అచ్చటముచ్చట లేకుండా చేస్తున్నావేంటని మా బంధువులంతా ఊకుమ్మడిగా నామీద దాడి చేస్తున్నారు..'' నసుగుతూ చెప్పాడతను.

అన్నపూర్ణ గుండెల్లో రాయి పడ్డట్లయింది. ''అంటే? ఏవిటన్నయ్యగారూ అచ్చటా ముచ్చటా అంటున్నారు? మీరడక్కపోయినా నేనే ముచ్చటపడి అల్లుడిగారికి మెళ్లో చెయిను.. వేలికి ముత్యపుటుంగరం చేయించాను. పెళ్లికి వేసుకోడానికి సూటూ కుట్టించాను''

''నిజవేనమ్మా.. అవన్నీ మేం అడక్కపోయినా నువ్వు కొన్నావు. ఎవరి కోసం? నీ అల్లుడి కోసం. అలాగే నీ అల్లుడి కొరకు నువ్వు మరో పని చేయాల్సొచ్చిందమ్మా. ఏ టైంకి ఎవరికెలాంటి అవసరమొస్తుందో ఎవరికి తెలుస్తుంది చెప్పు? నా ఫ్రెండొకడు పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఇప్పుడు అతనికో మంచి ఆఫరొచ్చింది. దాన్లో నీ అల్లుడికి షేరిస్తానంటున్నాడు. బంగారం లాంటి ఈ అవకాశాన్ని మరొహడు తన్నుకుపోకుండా, నీ అల్లుడు వెంటనే తన వాటాకి పెట్టుబడి పెట్టాల్సొచ్చింది. అందుకే నేనిలా రావాల్సొచ్చింది.''

అన్నపూర్ణ గుండె గుభేలుమంది. గొంతు తడారిపోతున్నా తనని తాను కంట్రోల్ చేసుకుంటూ నోరు విప్పింది. ''అన్నగారూ ఇంత అర్జెంటుగా డబ్బు సర్దుబాటు చెయ్యమంటే..'' నసిగింది.

''అమ్మా అన్నపూర్ణా. నీ పరిస్థితి నాకు తెలీదా? నేనేం అంత దుర్మార్గుడ్ని కానమ్మా. ఇంత తొందర్లో డబ్బు పుట్టించడమంటే మగాళ్లం మా వల్ల కూడా గాదు. కానీ నువ్వు గడపదాటి వెళ్లి ఎవర్ని చెయ్యి చాచి అడగనక్కర్లేకుండా ఏర్పాటు నేను చేస్తాను''

అయోమయంగా చూసిందామె.

''పక్క ఊళ్లో ఉన్న నా ఫ్రెండొకడు మీ ఇల్లు కొనుక్కుంటానంటున్నాడు. అదీ ఎక్కువ డబ్బు మన చేతిలో పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకుంటానంటున్నాడు''

అన్నపూర్ణకు స్పృహ తప్పినంత పనైంది. అక్కడున్న టేబుల్ని ఆసరాగా పట్టుకుని నిలదొక్కుకుంది గానీ, లేకుంటే కళ్లు తిరిగి కిందపడిపోయేదే. మెల్లగా తనని తాను కంట్రోల్ చేసుకుంది.


''అన్నగారూ పెళ్లి నాలుగు రోజుల్లో ఉందనగా మీరిలా మాట్లాడ్డం భావ్యం గాదు. మగదిక్కు లేనిదాన్ని. ఉన్న ఒక ఆధారమైన ఈ ఇంటిని అమ్మమనడం సబబు కాదు. ఈ ఇంటిమీద వచ్చే అద్దె డబ్బులు మా వారి పెన్షను డబ్బుతోను గుట్టుగా బతుకునీడ్చుకొస్తున్నాను. నా పరిస్థితి కాస్త ఆలోచించండి అన్నగారూ''

''నువ్వలాగంటే నేనేం చెప్పగలనమ్మా? మా వాడికి లక్షల కట్నం ఇస్తామంటూ వచ్చిన ఎన్నో సంబంధాల్నొదులుకుని, ఈ సంబంధం సెటిల్ చేశారని మా వాడు ఊరికే నా ప్రాణాలు తోడేస్తున్నాడు. వాడి భవిష్యత్తు నేను పాడుచేశానని నన్ను నానా మాటలంటున్నాడు. కట్నం డబ్బుతో బిజినెస్ చెయ్యాలని ఎన్నో ప్రణాళికలు వేసుకున్నాట్ట. కానీ మీ అమ్మాయి కుందనపు బొమ్మలాగుందని, ఇద్దరి జాతకాలు కలిసాయని నేనే వాడ్ని బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించాను. ఇప్పుడు మీరా డబ్బు సర్దుబాటు చెయ్యకపోతే ఈ పెళ్లి జరిగేదే లేదని చెప్పిరమ్మన్నాడు. తర్వాత నీ ఇష్టమమ్మా'' అక్కడో పెద్ద బాంబు పేల్చి తన దార్ని తాను వెళ్లిపోబోయాడు ఆనందరావు.

అన్నపూర్ణ నిస్సత్తువుగా అక్కడే నేల మీద కూలబడిపోయింది. తల్లి ఎంత సేపటికీ గది విడిచి రాకపోవడంతో లోపలికొచ్చి చూసిన అరుంధతి కంగారుపడిపోయింది. ఏమడిగినా మాట పలుకులేకుండా పిచ్చిదాన్లా చూస్తూన్న తల్లిని చూసి భయపడిపోయింది. తమ్ముడ్ని పంపించి పక్కింటి పిన్నిగారి బాబాయ్‌గార్ని పిలిపించింది. ఆవిడ వచ్చి ఓదార్పుగా మాట్లాడేసరికి ఇంక తట్టుకోలేక భోరుమంది అన్నపూర్ణ. బుజ్జగించి అడిగేసరికి విషయం చెప్పింది. అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమన్నారు అందరూ.

''అన్నపూర్ణా అతగాడిక్కడుండగానే మాకు కబురెట్టకపోయావా? అతనికింత గడ్డెట్టి బుద్ధి చెప్పేవాళ్లం గదా? పెళ్లి దగ్గరకొచ్చేసింది. అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. ఇప్పుడొచ్చి ఇలాంటి తప్పుడు కూతకూస్తాడా? మనం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పిల్ల భవిష్యత్తుకు దెబ్బ రాకుండానే చూసుకోవాలి.''


''అదేనండీ వాళ్ల భరోసా. ఇప్పుడైతే



## ఛార్మి ఐటమ్ సాంగ్

**గ్లామరస్ హీరోయిన్లు సైతం ఐటమ్ సాంగ్స్ చేయడం ఫేషనైపోయిందిప్పుడు. తాజాగా 'స్టాలిన్'లో అనుష్క ఐటమ్ సాంగ్ చేసింది. ఛార్మి కూడా ఇప్పుడు ఓ ఐటమ్ నంబర్‌కి డాన్స్ చేస్తోంది. అల్లు అర్జున్ హీరోగా వస్తోన్న 'దేశముదురు' సినిమాలో ఛార్మి ఓ హుషారైన ఐటమ్ నంబర్‌లో మనకి కనిపించబోతోందిట. ఈ సినిమాకి దర్శకుడు పూరి జగన్నాథ్ కాబట్టి ఆ సాంగ్ ఎలా వుంటుందో అభిమానులకి ఇంక చెప్పక్కర్లేదు కదూ!**

మన జుత్తు వాళ్ల చేతిలో ఉంటుంది గదా. వాళ్లే మన్నా ఏం అడిగినా ఒప్పుకు తీరతామన్న ధీమా. ఛఛా.. ఎంతో మంచి వాళ్లు సంస్కార వంతులు అనుకుంటే ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నారు? ఈ ఏడుపేదో ముందే ఏడిస్తే ఇష్టమైతే ఒప్పుకునేవాళ్లం. లేకుంటే వద్దనేవాళ్లం. ఇప్పుడు రోట్లో తలపెట్టినట్లయింది మన పని. అరుణ్‌బాబింకా చిన్నపిల్లాడు. వాడి చదువుసంధ్యలు వాడికో దారి చూడాలి. నీ తనువు తెల్లార్చుకోవాలి. ఉన్న ఇల్లు కాస్తా అమ్మి వాళ్ల చేతుల్లో పెడితే ఇవన్నీ ఎలా?''



పిన్నిగారి మాటల్ని మధ్యలోనే అడ్డుకుంది అన్నపూర్ణ. ''పిన్నిగారూ.. తర్వాత ఆ తిప్పలేవో నేను పడతాను. అరుంధతి పెళ్లి ఆగకూడదు. అది తట్టుకోలేను నేను. దయచేసి నన్నర్థం చేసుకోండి''

''అమ్మా.. ఏంటమ్మా పిచ్చిదాన్లా మాట్లాడుతున్నావ్? నువ్వు, తమ్ముడు ఇక్కడ కష్టాలు పడుతుంటే నేనక్కడ సుఖంగా ఉండగలననుకున్నావా? ఐనా ఇలాంటి డబ్బుదాహం గల వాళ్లింటికెళ్లి నేను సంతోషంగా బతగ్గలననుకుంటున్నావా? నేను చచ్చినా ఈ పెళ్లి చేసుకోను ఇదిగాకపోతే మరోటి. మనకు తగ్గ సంబంధం దొరక్కపోదు. నువ్వనవసరంగా టెన్షన్ పడకు'' తల్లిని ఓదార్చింది అరుంధతి.

''అరుంధతీ ఇది పెద్దవాళ్ల వ్యవహారం. నువ్వు జోక్యం చేసుకోవద్దు. ముహూర్తం పెట్టుకుని పెళ్లి నాలుగు రోజుల్లోకొచ్చాక ఆగిపోయిందంటే ఎంత అప్రదిష్ట.. అశుభం కూడాను. ఏదో జరిగుంటుందని నింద నీమీద మోపి, అవాకులు చవాకులు పేలుతుంది సమాజం. నీకీ జన్మకి పెళ్లి సవ్యంగా జరగనివ్వరు. అది తట్టుకునే ఓపిక మనస్థైర్యం నాకు లేవు. పెళ్లయ్యాక నువ్వు అల్లుడు మనసెరిగి నడుచుకుంటూ మెల్లగా అతని మనసు మారిస్తే మీరే తమ్ముడికి, నాకు కొండంత అండగా నిలుస్తారు. ఐనా కట్నమడక్కుండా ఏ ఆడపిల్లకు పెళ్లి జరుగుతుందే ఈ రోజుల్లో? తమ్ముడి చదువయ్యి వాడు సెటిలైనాక ఉన్నదేదో మీ ఇద్దరికీ అప్పగిద్దామనుకున్నాను. కాకపోతే అంతా ఇప్పుడు కావాలని అడుగుతున్నారు వాళ్లు. అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. నువ్వింకేవీ మనసులో పెట్టుకోవద్దు. పిన్నిగారూ, బాబాయ్‌గారూ.. ఏం జరిగినా మన మంచికే అనుకుందాం. ఈ పెళ్లి జరిగితీరాలి. తర్వాత విషయం తర్వాత చూసుకుందాం. దయచేసి ఇంకెవ్వరూ నాకు అడ్డుచెప్పొద్దు. అలా చేస్తే నేను చచ్చినంత ఒట్టు.. నిజంగానే, తెల్లారేసరికల్లా నా శవాన్ని కళ్లజూస్తారు'' అంటూ అందరి నోళ్లు నొక్కేసింది అన్నపూర్ణ.

★ ★ ★

బస్టాండు నుండి బైట పడి నడుస్తూన్నవాడల్లా దూరాన మిత్రుడ్ని చూసి తక్కున ఆగాడు ఆనందరావు. ''ఒరే అప్పాజీ... అప్పాజీ''

పిలుపు విని వెనక్కి తిరిగి చూశాడు అప్పాజీ. ఆనందరావు వడివడిగా నడుస్తూ తన వైపే వస్తూ కనిపించాడు. ''వాటె సర్‌ప్రైజ్.. ఆనందూ నువ్వేంట్రా ఇక్కడ ఇలా.., వస్తూన్నట్టుగా ఫోనైనా చెయ్యలేదేంట్రా? బస్టాండుకొచ్చేవాణ్ని గదా'' మిత్రులిద్దరూ ఆనందంగా, కరచాలనం చేసుకున్నారు.

''నువ్వా.. బిజినెస్ పనుల్లో క్షణం తీరిక లేకుండా తిరుగుతుంటావాయె. నిన్ను బస్టేషన్‌కి రప్పించడం భావ్యంగా తోచలేదు నాకు. ఐనా నాకీ ఊరేదన్నా కొత్తా? నేనేవన్నా చిన్నపిల్లాడ్నా? సడెన్‌గా మీ ఇంటికొచ్చి సర్‌ప్రైజ్ విజిటిద్దామని ఇలా చెప్పాపెట్టకుండా ఊడిపడ్డాను. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు నువ్వు కనబడ్డం లక్కీనేరా. నెలకి ఇరవై ఐదురోజులు నువ్వు ఊళ్లంట తిరుగుతూనే ఉంటావాయె. ఇంతకీ ఇటువైపు వచ్చావేంటి?''

''కొత్తగా కన్‌స్ట్రక్షన్స్ మొదలెట్టాగదా. అదిగో ఆ కనిపించే అపార్ట్‌మెంట్సే. గుమాస్తాలకి ఇన్‌స్ట్రక్షన్సిచ్చి వస్తున్నాను. పద ఇంటికి పోదాం. నేను మధ్యాహ్నం మూడు గంటలకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బెంగుళూరు వెళ్తున్నాను. మళ్లీ ఎల్లుండికల్లా వచ్చేస్తాను. ఆ.. అన్నట్టు మీ చెల్లాయి కూడా ఊళ్లో లేదురా. ఏదో ఫంక్షనుందని పుట్టింటికెళ్లింది. తనూ ఎల్లుండే వస్తుంది. ఐనా నీకేం ప్రాబ్లం లేదులే. వంటవాడున్నాడు. పాత కుక్‌లా గాదులే. ఇతనికి వంట బ్రహ్మాండంగా వచ్చు. నీకిష్టమైనవేంటో చెబితే చాలు సూపర్‌గా తయారు చేసేస్తాడు''

''ఒరే అప్పాజీ.. నాకూ అవతల అర్జెంటు పన్లున్నాయిరా. తీరిగ్గా వచ్చి మీ ఇంట్లో ఉంటాను గదా. నాకూ ఓ గంటలో మా ఊరికి పోయే బస్సుంది. నీతో చాలా విషయాలు మాట్లాడాలి. పద అలా ఆ రెస్టారెంట్లో కూచుని మాట్లాడుకుందాం''

మిత్రులిద్దరూ రెస్టారెంట్ వైపు కదిలారు. ఖాళీగా ఉన్న చోటు చూసుకుని కూచున్నారు. కాఫీ తాగుతూ కబుర్లలో పడ్డారు. ''ఒరే అప్పాజీ అరవింద్ మేరేజ్ సెటిలైందిరా. అమ్మాయి అరుంధతిది ఈ పక్క ఊరే. లక్కవరం. ఆ టైంకి నువ్వు ఫేమిలీతో స్టేట్స్ వెళ్లావు. నేను ఎన్నిసార్లు నిన్ను కాంటాక్టు చేద్దామన్నా వీలు పడలేదు. అక్కడికెళ్లాక, నువ్వు సిక్కయ్యి..నాకూ ఫోన్ చెయ్యలేకపోయావు''

''అవున్రా. మేం మొన్ననే ఇండియా వచ్చాం. పనుల వత్తిడి వల్ల నీకు వెంటనే ఫోన్ చెయ్యలేకపోయాను. చాలా సంతోషకరమైన కబురు చెప్పావు. కంగ్రాట్స్‌రా''

''పెళ్లి ఈ నెల ముప్పై రాత్రి ఏడు గంటలకు. నువ్వు కాస్త తీరిక చేసుకుని చెల్లెమ్మను నా మేనకోడలు అనుపమను తీసుకుని ఒక రోజు ముందుగా వచ్చెయ్యి. పెళ్లికి ఇంక నాలుగు రోజులే టైముంది. బెంగుళూరు నుంచి రాగానే మరెక్కడికీ ప్రయాణం పెట్టుకోకు. ఇదిగో వెడ్డింగ్ కార్డ్ నేను స్వయంగా వచ్చి తనకి చెప్పలేదనుకుంటుందేమో చెల్లెమ్మ. సమయానికి తను ఊళ్లో లేదు. మరోలా భావించొద్దని నా మాటగా చెప్పు. అన్నట్టు మరో విషయంరా మనం ముందుగా అనుకున్నట్టు నువ్వు కొత్తగా మొదలెట్టబోయే బిజినెస్‌లో, నాకు షేరిస్తున్నట్టేగదూ?''

''ష్యూర్. ఆ విషయంలో నువ్వేలాంటి డౌటు పెట్టుకోకు''

''మరి నా పెట్టుబడి సొమ్ము ఎప్పుడిమ్మంటావ్?''

''ఒరే ఫూల్ ఏం మాట్లాడుతున్నావ్ రా? నీ దగ్గరుంటే బేంక్‌లో దాచుకున్నట్టే. నాకు అవసరమైనపుడు అడిగి తీసుకుంటాను గదా? అరవింద్ మేరేజవ్వనీ. బిజినెస్ గురించి డిటైల్‌గా మాట్లాడుకుందాం. పెళ్లికూతురు ఎవరన్నావ్? అరుంధతి.. అరుంధతి..'' వెడ్డింగ్ కార్డ్ తెరిచి చూశాడు అప్పాజీ.

''అరె.. మా అమ్మాయి ఫ్రెండు ఈ అరుం

## పాటలే పాటలు

**తెలుగు తమిళ భాషల్లో నిర్మాణం అవుతున్న 'అజంతా' అనే ఓ సినిమాలో 36 పాటలుంటాయట. దీనికి సంగీతాన్ని అందిస్తున్నది మరెవరో కాదు, 'మాయిస్ట్రో' ఇళయరాజా! ఒకే సినిమాలో 36 పాటలకి ట్యూనులు కట్టడం అంటే మాటలు విషయం కాదు. బహుశా ఈ సినిమా గిన్నిస్ బుక్‌లో కూడా చోటు సంపాదించుకోవచ్చునని చెన్నయ్ సినీ వర్గాలు అంటున్నాయి.**

థతి. తండ్రి లేడు. తల్లి, తమ్ముడు ఉన్నారు. చాలా మంచి పిల్ల. పద్ధతి గల ఫేమిలీ. ఎలాగైతేనేం మంచి కోడల్ని సెలెక్టు చేసుకున్నావ్‌రా''

''మంచి కోడలేవోగాని మనీ కోడలుగాదురా. అదేరా కట్నకానుకలు ఏవీ తీసుకురాని సాదాసీదా కోడలు. మధ్యవర్తి ముందే చెప్పి ఉంటే వాళ్ల ఇంటి వరకూ వెళ్లేవాణ్ణిగాదు. తీరా పిల్లని చూసొచ్చిందగ్గర్నుండీ నా సుపుత్రుడు ఆ పిల్లని తప్ప వేరెవ్వర్నీ పెళ్లాడనని భీష్మించుక్కూచున్నాడు. వియ్యాల వారి దగ్గర వాళ్లుంటూన్న ఇల్లు తప్పించి మరే ఇతర ఆస్తిపాస్తులు లేవు. తల్లి తదనంతరం ఆ ఇంట్లో సగం వాటా వస్తుందనుకో. అప్పటిదాకా ఆ ఇల్లు ఉంచుతారో అమ్ముకుంటారో ఎవడికి తెలుసు? అందుకే ఓ ట్రిక్ ప్లే చేశాన్రా'' ఆసక్తిగా వినసాగాడు అప్పాజీ.

''పైసా కట్నం కోరకుండా అరుంధతిని కోడలిగా చేసుకుంటామని లెటర్ రాశాను. ఇంకేముంది ఎగిరి గంతేసి వీరలెవెల్లో పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నారు వాళ్లు. ఆ అమ్మాయిని సెటిల్ చేసినందుకు నా కొడుకు చాలా ఆనందంగా ఉన్నాడు.''

''మంచి పనే చేశావు గదరా. దీనిలో నువ్వు ప్లే చేసిన ట్రిక్కేంటో నాకు తెలీలేదే'' ఒకింత ఆసక్తిగాను, సందేహంగాను అడిగాడు అప్పాజీ.

''నేను చెప్పేది పూర్తిగా వినరా. ఇదిగో ఈ ఉదయమే వియ్యాలవారింటికెళ్లి అక్కడ్నుండి నేరుగా ఇక్కడికే వచ్చాను. మావాడు చెయ్యబోయే బిజినెస్‌కి డబ్బులవసరం. అర్జెంటుగా ఏర్పాటు చెయ్యమని వియ్యపురాల్ని అడిగాను. తెల్లమొహం వేసింది ఆవిడ. నీకెలాంటి శ్రమా లేకుండా అన్ని ఏర్పాట్లు నేను చేస్తాను. చెల్లెమ్మా అంటూ అసలు విషయం బైటపెట్టాను. నా స్నేహితుడున్నాడు అతను మీ ఇల్లు కొనుక్కుని ఎల్లుండికల్లా డబ్బు నా చేతిలో పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు అని చెప్పాను''

బిత్తరపోయి చూడసాగాడు అప్పాజీ.

''అలా వెర్రిమొహం వేసుకునుండకురా. నీ ఫ్రెండంటే అల్లాటప్పాగాడనుకున్నావా? ముందే ఇల్లు మొత్తం పిల్లపేర్న పెట్టమంటే భస్తే ఒప్పుకోరు. పెళ్లి దగ్గర్లో ఇలాంటి ఫిట్టింగు పెడితే పరువు మర్యాదలంటూ భయపడి చచ్చేవాళ్లు ఒప్పుకోక ఏం చేస్తారు? నువ్వు ఎల్లుండి ఊర్నించి వచ్చేసరికి నేను, వియ్యపురాలితో రిజిస్ట్రారాఫీసు దగ్గర రెడీగా ఉంటాను. ఆ ఇల్లు నీ పేర్న రిజిస్టర్ చేయించుకుందువు గాని''

అప్పాజీకి ఎంతో అసహనంగా కోపంగా కూడా ఉంది. ''ఏంట్రా ఇది? ఏదో సినిమా స్టోరీలా చెప్తున్నావే నాకు? నేనేంటి ఆ ఇల్లు కొనుక్కోవడమేంటి? నీకు మతి చెడలేదు గదా''

''అబ్బా అలా కోప్పడకు రా. ఎంత హీనంగా చూసినా ఆ ఇల్లు ఐదు లక్షలు వేల్యూ చేస్తుంది. నేనన్నీ కనుక్కుని వస్తున్నాలే. ఐదు లక్షలంటే నీకు ఆఫ్టరాలే గదా. బిజినెస్ మాగ్నెట్‌వి. నీకు తెలియని విషయాలు కావివి. అవకాశం చేజిక్కినపుడు దేన్నీ వదులుకోకూడదు గదా. ఇల్లు అమ్మకుండా కోడలి పేర్న రాయించేసుకోవచ్చు గదా అని అడగొచ్చు నువ్వు. అలా చేస్తే కూతురిల్లే గదాని వియ్యపురాలు భస్తే ఆ ఇంట్లోంచి కదలదు. అద్దె కట్టదు. నా కోడలూ మొగుడికి మొర పెట్టుకుని తల్లినక్కడే ఉండేట్టు ఫిక్స్ చేసేస్తుంది. నీకెంత నష్టమో ఆలోచించు. నువ్వు తెలివైన వాడివి. నెల తిరిగేసరికల్లా ఆ ఇంటిని ఎంతో కొంత లాభానికి తిరిగి అమ్మేసుకోగలవు. ఇల్లు అమ్మిన డబ్బు నా వాటాగా బిజినెస్‌లో పెట్టుబడిగా జమేసుకో. ఏంటీ అర్థమైందా? ముందు ఎలాగైనా సరే ఆ ఇంటిని వాళ్ల నుండి లాక్కుని మన హేండోవర్‌లో పెట్టుకోవాలి. అదీ నా ప్లాను. అన్నట్టు చెప్పడం మరిచాను. ఈ విషయాలేవీ నా కొడుక్కి తెలీనివ్వకురా. పెళ్లయ్యాక ఎలాగూ తెలీక మానదు. అందుకే పెళ్లికి ముందే ఈ ప్లాను వేసి ట్రిక్ ప్లే చేశాను. మరి నేను బయల్దేరతాన్రా. బస్సుకు టైమవుతుంది''

★ ★ ★

''ఒరే అప్పాజీ.. ఇదిగో ఐదు లక్షలు. నా వాటాకు నీకు పది లక్షలిచ్చినట్టుగా మనం అగ్రిమెంటు రాసుకుందాం. ఎంతో ప్రాణ స్నేహితులమైనా దేనికదే పకడ్బందీగా ఉండాలి గదా?'' ఆనందరావు బేగ్ తెరిచి డబ్బు తీసి అప్పాజీకందించాడు.

''ఐదు లక్షలిచ్చావు. పది లక్షలిచ్చినట్టుగా రాసుకుందామంటున్నావు. భలే కిలాడివిరా నువ్వు'' జోకేశాడు అప్పాజీ.

''ఊర్కోరా. హాస్యమాడ్డానికిదా సమయం? మొన్న మా వియ్యపురాలి ఇంటి తాలూకు ఐదు లక్షలున్నాయి కదా?''

''ఆ ఇల్లేవన్నా నేను కొనుక్కున్నానా? నా పేర్న రిజిస్టరు చేయించుకున్నానా?''

''రిజిస్ట్రేషన్ ఖర్చులు బాగా పెరిగాయి. మరో పార్టీని చూసి ఏకంగా వాళ్లకే అమ్మి వాళ్లకి రిజిస్ట్రేషన్ చేయిస్తానని, ఇంటి తాలూకు దస్తావేజులు నీ దగ్గరుంచుకున్నావు గదరా'' అయోమయంగా అడిగాడు ఆనందరావు.

''దస్తావేజులు నా దగ్గరుంచాను. కానీ ఇల్లు వేరెవ్వరికీ అమ్మనివ్వను నేనూ కొనుక్కోను నిన్నూ అమ్మనివ్వను.''

''అంటే?''

''అంటే ఏవిటి? ఆ ఇల్లు నీ వియ్యపురాలికే ఉంటుంది. నువ్వు నీ దగ్గర డబ్బు మరో ఐదు లక్షలు తెచ్చి బిజినెస్‌లో పెట్టు'' నిదానంగా చెప్పాడు అప్పాజీ.

''నీకేవన్నా మతి చెడిందేంట్రా? ఇలా వాగుతున్నావ్? ఐనా ప్రాణ స్నేహితుడి కంటే ఎవరో పరాయివాళ్లు ఎక్కువైపోయారేంట్రా నీకు? నిన్ను నమ్మేగదా ఇంటి దస్తావేజులు నీకు అప్పగించింది. లేకపోతే అప్పుడే నా పాట్లేవో నేను పడి మరొకళ్లెవరికైనా అమ్మకునుండే వాడ్ని గదా? ఇంత మోసం దగా చేస్తావా నన్ను?'' ఆవేశంగా అరిచాడు ఆనందరావు.

''హుష్.. ఎందుకంతలా గొంతు చించుకుంటావురా ఆనందూ? నువ్వు చేసిందానికంటే నేను చేసిందేవన్నా పెద్ద మోసమూ, దగానట్రా? పెళ్లి నాలుగు రోజుల్లో పెట్టుకుని అంత చీప్‌గా బిహేవ్ చేస్తావా? అరుంధతి ఆమె తల్లి కూడా నాకు తెలుసు. ఎంతో పరువు గల మంచి కుటుంబం వాళ్లది. అన్నపూర్ణ నా తోబుట్టువులాంటిది. పెళ్లికి ముందు నువ్వు వచ్చి నాతో మాట్లాడిం తర్వాత అరవింద్‌తో మాట్లాడాను. వాడే నాకీ ఐడియా ఇచ్చాడు. బుద్ధిలేదట్రా నీకు? ఇంత చీప్ మెంటాల్టీయా నీది? నిన్ను నా స్నేహితుడిగా చెప్పుకోడానికే గిల్టీగా ఫీలవుతున్నానిప్పుడు. ప్రాణం పోయినా మాట మీద నిలబడాల్రా. అరుంధతికి తండ్రి లేడు గదా. వాళ్లకెంతో అండగా నిలబడాల్సింది పోయి ఇలా సంస్కారహీనుల్లా ప్రవర్తిస్తావా? మరో ఇంటి నుండి వచ్చిందైనా కోడలూ మన కూతుర్లాంటిదేరా. కోడలు కంట తడిపెడితే మనకు శుభం కలుగదు. దేన్లోనూ కలిసిరాదు. ఆ విషయం మర్చిపోకు. కన్ను కాలు సవ్యంగా ఉన్నంతవరకూ నా అంతటి వారు లేరని విర్రవీగుతాం. కానీ ఒంటికేదన్నా వచ్చినపుడే తెలుస్తుంది నా అనే వాళ్ల అవసరం. వాళ్ల ఆదరాభిమానాల గురించి ఎంత తపించిపోతామో..మనది పోయే కాలమే గానీ, వచ్చేకాలం గాదు. మనమెంత సంపాయించినా కన్నుమూసే వరకూ ప్రశాంతంగా బ్రతకాలీ అంటే మన పిల్లల సహకారం కూడా ఉండాలిరా. మనం పెద్ద మనసుతో మసులుకుంటూ మన పెద్దరికం నిలబెట్టుకుంటే పిల్లలూ మనల్ని అపురూపంగా చూసుకుంటారు. మనం ఇచ్చిందాన్ని బట్టే మనకు లభిస్తుంది అది మర్చిపోకు. ఇప్పటికే ఎక్కువ మాట్లాడినట్టున్నాను. ఒరే ఆనందూ నీ మనసు నొప్పించాలని నేనంత మాట్లాడలేదురా. అర్థం చేసుకుంటే ఆనందపడతాను. అపార్థం చేసుకుంటే మట్టుకు, కొడుకు కోడలి దృష్టిలో చాలా హీనమైపోతావు. ఇవిగో ఇంటి తాలూకు దస్తావేజులు. ఆ ఇంటిని అమ్మకుంటావో అన్నపూర్ణమ్మకే అప్పగిస్తావో నీ ఇష్టం'' కాగితాలు ఆనందరావు చేతిలో పెట్టాడు అప్పాజీ.

''చచ్చిన పాముని ఇంకా చంపకురా. వీటిని నువ్వే అన్నపూర్ణమ్మ కందజెయ్యి'' దస్తావేజుల్ని అప్పాజీ చేతికందిస్తూ సిగ్గుతోను, పశ్చాత్తాపంతోను తలవంచుకున్నాడు ఆనందరావు.